

# 25 నేరమూ శిక్షా

లోకాంతరంలో రూపులేఖల్లేని 'శాల్తీ'లన్నీ పోగయి విచారంగా కూర్చున్నాయి. వాటి మధ్య ఒక శాల్తీ మరీ దిగులుగా ఉంది.

"టైమై ఆరంభించబోతూంది" అందొకటి.

ఏడుపు ప్రారంభించింది శాల్తీ.

"ఏం చేస్తాం? గిట్టుట పుట్టుట కొరకే అన్నారు" అందొక వేదాంతి.

"మరే, అందరం కాస్త ముందూ వెనగ్గా పుట్టాల్సిన వాళ్ళమే" అంది వంత గొంతు.

"బావుంది, అలాగని నిక్షేపం వంటి శాల్తీ చూస్తూ చూస్తూ వుండగా పుట్టేస్తూ వుంటే ఊరుకుంటామా?"

"నీకింకా జన్మ వాసనలు పోలేదు. అన్నీ ఆ మాటలే. ఆ ఊహాలే"

"అదిగో అమృతం వచ్చింది"

అంతా కలిసి అమృతం పోసి, ఇంకా రకరకాల ప్రక్రియలు చేశారు. ఆ శాల్తీ పుట్టిపోకుండా కాపాడదామని.

"క్రితం జన్మలో నేనాట్టే పాపాలు చెయ్యలేదే? అసలు చేసినట్టే లేదు. అయినా నాకీ జనన శిక్ష ఎందుకో" అంది శాల్తీ దిగులుగా.

"జీవీ? కితంసారి నువు బసచేసిన దేహానికి తప్పులు చేయాల్సిన అవసరం, అవకాశం లేవు. అంచేత నీ నిగ్రహానికి పరీక్ష జరగలేదు. అది రుజా కాలేదు.... అందుకని ఈసారి నీకు పొలిటీషియన్ జన్మ ఏర్పాటు చేశారు. ఈసారి నెగ్గితే ఇక విడుదలే...."

పొలిటీషియన్ అన్న మాట వినగానే ఆ శాల్తీ ముఖ కవళిక మారిపోయింది. దిగులుపోయింది. బొమ ముడిపడింది. బింకం వచ్చింది.

"అయ్యో, అయ్యో! ఇంకేముంది? అయిపోయింది పుట్టేస్తున్నాడు పుట్టేస్తున్నాడు" అన్నాయి దగ్గిరి శాల్తీలు కంగారుగా.

ఆ జీవి భూలోకానికి బయల్దేరింది.

"మేమంతా నీ కోసం ఎదురుచూస్తూంటాం. చప్పున తెముల్చుకు చక్కా వచ్చెయ్యి" అన్నాయి సాటి శాల్తీలు తక్షణం భూలోకం నుండి బయటకి వచ్చే ద్వారం దగ్గిరికి బయల్దేరుతూ.

"నేను కూడానే వచ్చి గుర్తుచేస్తా, నువ్వు తప్పు చేస్తే. కాస్త ఇది గుర్తుంచుకో" అంది ఒక స్నేహితుడు.

జననశిక్షకు బయలుదేరిన శాస్త్రీ భూలోకం వచ్చి ఒక ఇంట్లో వాలింది. అక్కడ పుడదామని. కాని, అక్కడ అట్టే వసతులు, సిరిసంపదలు కనబడలేదు. ఆ యింటివాళ్ళు కారుకోసం, టెలిఫోను కోసం దరఖాస్తులు పడేశారు గాని అవి రావడానికి ఏ రెండు మూడేళ్ళో పట్టవచ్చు. పైగా ఆ గేస్తు పార్టీ నచ్చలేదు.

కొంచెం ఆలోచించి, వెంటనే శాస్త్రీ ఇంకోచోటుకు వెళ్ళింది. పెద్ద భవంతి, బోలెడు కార్లు, పది ఫోనులూ ఇక్కడా లేవుగాని గేస్తు మంచి గ్రూపు నాయకుడు. కొద్దికాలంలో అవన్నీ గడిస్తాడు. ఇక కాలయాపన తగదని శాస్త్రీ అక్కడ దిగింది.

"దుష్ట సింహుడని పేరు పెట్టారు బారసాలనాడు (అంటూ కథ అరంభించారు రామిరెడ్డిగారు) దుష్టసింహుడేమిటని నవ్వకు. దుష్టుల పాలిట సింహం అని అర్థం చెప్పుకున్నారు వాళ్ళు. దరిమిలాను సెటైర్ రాయదలచుకున్నాడెవడో ఇలా నచ్చజెప్పి పెట్టించాడు. దుష్టసింహుడు పుట్టిన నాలుగేళ్లకి, తండ్రి రాజకీయంగా దెబ్బతిన్నాడు. పింఛనీ దీసుకునే స్టేజి కొచ్చేశాడు. దుష్టసింహుడికీ వరస నచ్చలేదు. ఇదేటెందులో బడ్డామని ఊహజేసి తండ్రి మనసులో దూరి, దాన్ని మార్చేసి తనని ఇంకో గ్రూపాయనకి దత్తు ఇప్పించుకున్నాడు. ఆయన గట్టోడేగాని, పార్టీ అదో మోస్తరు. చచ్చేస్ ఇదేటని ఓనాడు సంబరాలు జరుగుతూండగా కావాలని తప్పిపోయి ఇంకో పార్టీ నాయకుడికి దొరికి అళ్ళింటి బిడ్డగా పెరగబొయ్యాడు. పైనించి తోడొచ్చిన నేస్తం ఫకాల్న నవ్వి "నీ దుంపతెగ ఐదేళ్లొచ్చేతలికే రెండు పార్టీలు ఫిరాయించావు. ఇహ 'పైకి' రాదల్చుకోలేదా? జాగర్త సుమీ. ఆనక సరుదుకుందామంటే కుదర్దు – గబుక్కున టైమైంది పైకి రా జడ్జిమెంటు కంటారు" అవటాని హెచ్చరిక చేశాడు. దుష్టసిమ్మడు నవ్వేసి, "ఇది పైకెళ్ళే పద్ధతేలే. నీకు తెల్దిందులో బిస" అన్నాడు.

సరే, అడు 'ఈడేరి' మైనార్టీ తిరిగేతలికల్లా నియ్యల్లే గడుసోడు గట్టోడు అనిపించుకున్నాడు. అయ్యపేరు జెప్పి రాజకీయాల్లో రాటుదేరి గాడిలో పడ్డాడు. దేవాంతకుడని పేరు దెచ్చుకుని అయ్యని సంతోషబెట్టి సాగనంపాడు.

దుష్టసింహుడు 'రాజ్యా'నికొచ్చిన కొద్దిరోజుల్లో ఆడి సంగతి అందరికీ దెలిసింది. సెటైర్రాద్దారనీ, రాసి డబ్బు గడిద్దారనీ, ఆ పేరు బెట్టించినోడు తీరా రాయబోయే తలికేం రాయాలో తోచలేదు. ఈడి సెటైర్లని దాటి పొయ్యా యాడి పన్లు. లోకంత్రపు నేస్తం కంగారుపడి దుష్టసింహుడి గుండెల్లో దూరి కెలికి గుర్తు చెయ్యబొయ్యాడు. కూడని పనులు చెయ్యకు. చెయ్యకు. ఇది నాయం గాదది నాయంగాదంటూ.

'నువ్వలాగుండేస్' అని గసిర్నా పోలేదు. కోపం వచ్చి దుక్క బనీను, చొక్కా, చలి బనీను, దాని మీద కోటు పేసి కండవా కప్పాడు – గుండెలో నేస్తం మాట వినబడకుండా.

అయ్యో, ఈడు పెడదార్ల బడిపోయాడన్న బాధని ఆ నేస్తం ఇవటాల కొచ్చి బుజాన గూచ్చుని చెవులో రొద పెట్టాడు. ఇలాగైతే నీకు జనన మరణాల ఖైదు నుంచి విడుదల దొరకదురోయ్. ఇది ధర్మంగాదు అని.

దుష్టసింహుడిది పనిగాదని ఈ చెవికీ ఆ చెవికీ జోడుజోడు వందిమాగధుల్ని

తగిలించుకున్నాడు. అళ్ళు ప్రతిదీ పొగిడీ, ప్రతి అధర్మానికీ ధర్మ పన్నాలు లాపాయింట్లు చెప్పి మెచ్చుకునేవోళ్ళు గట్టిగా.

లోకాంత్రపు నేస్తం ఆశొదలక, చెవులొదిలి కళ్ళముందు యెగిరి సైగలు చెయ్యడమారంభించాడు.

దుష్టసింహుడిహ లాభం లేదని తనని పొగిడే పత్రికలు పుస్తకాలు తెచ్చి నల్ల కళ్ళజోడు పెట్టుకు చదువుకోసాగాడు.

అయ్యో మనోడు పవరులో దిగడిపోతన్నాడన్న దుఃఖం కొద్దీ, అది మరిగితే దేహం ఒదల్డంకన్న దాన్నొదల్డవెక్కువై పోద్దనీ బయపడి, ఆ నేస్తం ఒహా పెద్ద మనిషిలోకి పరకాయ ప్రవేశం జేసి, ఎదరపార్టీ మనిషి అయిన దుష్టసింహుడిని ఏకేసి తప్పులన్నీ బయటపెట్టి తిట్టడ మారంభించాడు.

కొన్నాళ్ళు జూశాక, దుష్టసింహుడు అణ్ణి తనెంపు లాక్కుని అడికో పెద్ద పదవీ కారూ గట్రా ఇచ్చేశాడు. ఆ నేస్తం అక్కడితో ఆట్లో మునిగి ఊపిరాడక తేలిపోయాడు.

అవతల భూలోకపు అవుటుగేటు దగ్గర కుర్రలూ గట్రా తెప్పించి రడీ జేసుకు కూర్చున్న లోకాంత్రపు శాల్తీలు ఈ వొరసజూసి ముక్కున (అటికి ముక్కులుండవనుకో) వేలేసుకున్నాయి అయ్యో అని. ఈ తోడెళ్ళినాడు కూడా చిక్కడి పొయ్యాడు గదాని ఇంకో శాల్తీ బయల్దేరొచ్చింది.

వొచ్చి ఇద్దరికీ చెప్పింది. పూర్వజన్మ వృత్తాంతం గుర్తు జేసింది. మీరిక్కడి కొచ్చేముందేంపిడిచి వచ్చారూ, తప్పుల్జేయకుండా చప్పున తెమిలి తప్పించుకొస్తామ న్నారూ, ఇపుడీ రాజకీయాల్లోబడి మాట నిలకళ్ళేకుండా అవకతవకల్జేస్తున్నారు అని హెచ్చరిక జెప్పింది.

అళ్ళు నవ్వి నీ మొఖం పొమ్మన్నారు.

మీరిలా కొన్నాళ్ళు జేస్తే ప్రజలే మిమ్మల్నెళ్ళ గొడతారు సుమా అని హెచ్చరించింది పై నుంచొచ్చిన నేస్తం.

అళ్ళు నవ్వి అళ్ళ ముఖం పొమ్మన్నారు.

ఈ శాల్తీ క్కోపం వచ్చింది. యెలక్షను టైమైందంతలో. ఈ శాల్తీ దుష్టసింహుడిని బెదిరించింది. నివ్వు ప్రజల్ని దగా జేస్తున్నావు అళ్ళ పేరు జెప్పి నీ పవరు, నీ పన్లు జూసుకుంటున్నావు. ఇది దగా. ప్రజలూరుకోరు – అందా దేవదూత.

నీ మొఖం ఈ మాట లింకెక్కడన్నా అంటే నవ్విపోతారు జాగ్రత్త అన్నాడు దుష్టసింహుడు.

దేవదూత క్కోపం వచ్చింది.

నేను ప్రజలందరికీ నీ సంగజ్జెబతానుండు అంది.

నీ మొఖం ప్రజలకి చెపితే నాకేం బయ్యం నన్ను ఎన్నుకునేది ఓటర్లు. ప్రజలు వేరు. ఓటర్లు వేరు అన్నాడు దుష్టసింహుడు నవ్వి.

సర్లే, ఎలక్షనయ్యాక చూసుకో అని కోపంగా వెళ్ళింది దేవదూత, వెళ్ళీ అద్దె సైకిలేసుకుని ఇంటింటికీ వెళ్ళి ప్రజలందరికీ చెప్పింది. మళ్ళీ యెలక్షనుదాకా మీ మొఖం చూడనాడికి మీ వోటెందు కేస్తారు. ఏ పార్టీ అయినా సరే, మొహమాటం

లేకుండా - నిజంగా మీకు సేవచేసే వాడికే ఓట్లెయ్యండి అని చెప్పింది. దుష్టసింహుడికి మీరంటే ఖాతరులేదు. అడికెయ్యకండి అని కూడా జెప్పింది.

కాని దుష్టసింహుడు లక్షల కొద్దీ వరహాలు వెదజల్లాడు. గెలుచుకున్నాడు.

వెనుకటికో రాజుగారు తనింట్లో శుభకార్యానికి ఊళ్ళో అందర్నీ తలా చెంబెడు పాలు దెచ్చి పొయ్యమని గంగాళం పెట్టాడు. యెవుడి మటుకాడు నేనొక్కణ్నే చెంబెడు నీళ్లోస్తే అన్ని పాలలో తెలుస్తదేటిలే అనుకున్నాడు. తెల్లారేసరికి గంగాళం నిండింది కాని అన్నీ నీళ్ళే. ఒక్క పాల చుక్కలేదు. రాజుగారు ఊరందరికీ దండనేశారు. అలా ప్రజల్లో ప్రెతోడూ, ఓటరుగానే ఆలోచించి మన వొక్కళ్ళం డబ్బు తీసుకోటేస్తే పోయిందేటని సర్ది జెప్పుకున్నాడు.

దుష్టసింహుడు ఆ తరువాత మళ్ళీ ఎన్నడూ తన వాడకేసి రాలేదు. పైకెళ్ళిపోయి తన వ్యాపారం, తన యవారం జూసుకున్నాడు. రోడ్లు, బ్రిడ్జీలు, కాలవలు, ఆస్పత్రులు, బళ్ళు గట్రా అందరికీ పంపకాలవుతున్నప్పుడు తన వాడ తరపున తనెళ్ళిపోట్టాడలేదు. అళ్ళకొచ్చిందేదో వొచ్చింది. కావలసింది రాలేదు; రావలసింది కూడా రాలేదు.

జనం చాలామంది నొచ్చుకున్నారు. అయ్యో మనోడు పట్టించుకోడన్దెలిస్తే మనవన్నా పొయ్యి ఏడిచేవోళ్ళం గందా అనుకున్నారు. ఇలాటోడు దొరికాడేటని అడిపోసుకున్నారు. ఇది శానా అన్నాయం, దగా అన్నారు.

"సుబ్బరాజూ, ఇంత అన్నాయం దగా జేసిన దుష్టసింహుడికి పైనున్నవాడు ఎన్ని జన్మల శిక్ష వేస్తాడు? అడి కసలు మోక్షవుంటదా చెప్పు చూదాం" అన్నారు రామిరెడ్డిగారు.

సుబ్బరాజు రివాజైన దానికన్నా ఎక్కువ సేపు ఆలోచించాడు. తికమక పడ్డాడు. చివరికి తీర్పు తోచింది.

"రెడ్డిగారూ, దుష్టసిమ్ముడికి శిక్ష పడదు. అతను జేసింది సరేం కాదు. పాపంవూ కాదు. అతను దాదాపు డబ్బిచ్చి పలుకుబడి కొనుక్కున్నాడు. అంచేత ప్రజలకి సేవ చెయ్యాలని నియమం లేదు. ఇహ ప్రజలంటారా? అళ్ళ కర్మం. అళ్ళు దుష్టసిమ్ముడిని ఎన్నుకోలేదు. నోట్లు దీసుకు ఓట్లమ్మారు. అంచేత అడు పైకెళ్ళి తమకేదో చేస్తాడనుకోడం బుద్ధి పొరపాటు. చెయ్యాలనడం అన్యాయం. జల్లినవి జొన్నలైతే పండేవీ జొన్నలే. వరిధాన్యం ఎలా పండుద్ది? ఆ వాడ ప్రజలు జల్లిన ఓట్లు ఏ రకంవో, అక్కడ యెన్నికైన నాయకులూ ఆ రకంవే. ఇందులో దగాలు లేవు నేరాలూ లేవు" అన్నాడు.

రామిరెడ్డిగారు సెభాష్ అన్నారు. చప్పట్లు కొడుతూ లేచి వచ్చి సుబ్బరాజుని లేవదీసి కౌగిలించుకున్నారు.

"సుబ్బరాజూ, నీకు ధర్మసూక్ష్మం పూర్తిగా బోధపడింది. పండితుడి వయ్యావు, ఇహ ఈ దఫా ఎలక్షనుకి నివ్వు నిలబడవలసిందే. ఇదిగో నామినేషను ఫారాలు రెడీగా ఉంచాను. దస్కతులు జెయ్యి" అన్నాడు.

"నేనా? ఎలక్షనుకా? ఇదేటిది?" అన్నాడు సుబ్బరాజు నిర్ఘాంతపోయి.

"అవును. నివ్వే. చౌదరికైతే నేను మాట సాయానికి రాను. నివ్వు ఇంతోడివి. నిలబడకపోతే దేశానికే నష్టం. లెద్దూ" అన్నారు రెడ్డిగారు - హెచ్చరిగ్గా రాజు భుజం చరిచి.

★ ★ ★